క్లుప్తంగా

సజ్జలను కలిసిన కోటేశ్వరరావు


సజ్జలను మర్యాదపూర్వకంగా కలిసిన పెద్దిపోగు కోటేశ్వరరావు

ఒంగోలు: ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డిని మాదిగ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పెద్దిపోగు కోటేశ్వరరావు, రాష్ట్ర ఇన్‌చార్జి చిలకభాస్కరరావు, పెదకూరపాడు నియోజకవర్గ అధ్యక్షుడు కంచర్ల అచ్యుతరావు, రైతు సంఘం అధ్యక్షుడు నందిగం సుందర్రావు మర్యాదపూర్వకంగా కలిశారు. వీరు తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో సజ్జలను కలుసుకున్నారు.

జూన్ 1 నుంచి పింఛన్ల పంపిణీ

ఒంగోలు టౌన్: సామాజిక భద్రతా పింఛన్లను 1వ తేదీ నుంచి పంపిణీ చేయనున్నట్లు ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ జస్వంతరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా డీబీటీ పద్ధతి ద్వారా పింఛన్ల పంపిణీ చేస్తామని తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వం నిధులను విడుదల చేసిందని, డీబీటీ ద్వారా పంపిణీ చేసే పింఛన్ల తాలుకు నిధులను బ్యాంకుల్లో జమ చేస్తామని తెలిపారు. మిగిలిన పింఛన్‌దారులకు సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటింటికీ తిరిగి పంపిణీ చేస్తామన్నారు. జూన్ 1 నుంచి 5వ తేదీ వరకు పింఛన్ల పంపిణీ జరుగుతుందని తెలిపారు.

కొలతల ప్రకారం పని చేయించాలి


మాట్లాడుతున్న ఏపీడీ

ఒంగోలు రూరల్: ప్రతి ఒక్కరూ కనీసం రూ.280 తగ్గకుండా కొలతలు ప్రకారం పని చేయించాలని ఒంగోలు క్లస్టర్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పాలేటి వెంకటస్వామి అన్నారు. ఈ సందర్భంగా ఒంగోలు మండల కార్యాలయంలో గురువారం ఒంగోలు క్లస్టర్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పాలేటి వెంకటస్వామి అధ్యక్షతన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఒంగోలు, కొత్తపట్నం, నాగులుప్పలపాడు మండలం సిబ్బంది, ఏపీఓ, ఈసీ, టీఏ, ఎఫ్ఏకు సమీక్ష సమావేశం నిర్వహించారు. హార్టికల్చర్, ప్లాంటేషన్, లేబర్ పెంచే విధంగా పనులు నాణ్యంగా పనిచేయించాలని ముఖ్యంగా వేతనం రూ.280 తగ్గకుండా కొలతలు ప్రకారం చేయించాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఒంగోలు ఎంపీడీఓ, తదితరులు పాల్గొన్నారు.

ఐఫియా కౌన్సిలర్‌గా పీవీ సుబ్బారావు


పీవీ సుబ్బారావు


కేవీజీ కీర్తి

ఒంగోలు: ఐఫియా కౌన్సిలర్‌గా పీవీ సుబ్బారావు ఎంపికయ్యారు. కృష్ణా జిల్లా గుడివాడ పట్టణంలో గురువారం జరిగిన ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఎంపికయ్యారు. ఆయనతోపాటు ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేవీజీ కీర్తి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఇరువురికి ఏపీటీఎఫ్ ప్రకాశం జిల్లా కౌన్సిల్ గౌరవాధ్యక్షుడు ఎ.అమ్మయ్య, జిల్లా అధ్యక్షుడు బి.వెంకట్రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.అశోక్‌కుమార్ తదితరులు అభినందనలు తెలిపారు.


త్వరగా ఇంటికెళ్లాలి..


ఎండలో మళ్లీ.. ట్రాఫికా..


చిన్నారులకు రక్షణ..


ఇంత ఎండలో నడక అంటే కష్టమే..



భానుడు సలసల.. జనం విలవిల

ఇది మే మాసం..కాదు మే మోసంలా ఉంది.. ఢిల్లీ లాంటి నగరాల్లో 52 డిగ్రీల సెంటీగ్రేడ్ దాటడమంటే మాటలా.. అది ఎడారి ప్రాంతమా.. నగరమా అనుకుంటున్న ఒంగోలు వాసులకు గత రెండు రోజులుగా మండే ఎండలు చెమటలు పట్టిస్తున్నాయి. ఒంగోలు కూడా సహారాల ఉందేంట్రా అని ఇళ్లలోనే సైలె మోడ్‌లోకి వెళ్లిపోయారు. నగరంలో గురువారం అత్యధిక ఉష్ణోగ్రతలతో పాటు వడగాల్పుల ధాటికి రోడ్లన్నీ బంద్ అయిపోయాయి. – సాక్షి, ఒంగోలు


ఎండతీవ్రతకు జనసంచారం లేక నిర్మానుష్యంగా ఉన్న రైల్వేస్టేషన్ రోడ్డులోని మాగుంట సుబ్బరామిరెడ్డి విగ్రహం సర్కిల్


చిన్నారులకు గొడుగు..

హనుమాన్ శోభాయాత్రలో పాల్గొనండి


కరపత్రాల ఆవిష్కరణలో విశ్వహిందూ పరిషత్, భజరంగ దళ్ సభ్యులు

ఒంగోలు మెట్రో: హనుమజ్జయంతి ఉత్సవాల సందర్భంగా విశ్వ హిందూ పరిషత్, బజరంగ దళ్ ఆధ్వర్యంలో శనివారం ఒంగోలులో హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ ప్రకాశం జిల్లా సభ్యులు తెలిపారు. స్థానిక సంతపేటలోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో జరిగిన పాత్రికేయ సమావేశంలో వివరాలు తెలిపారు. జూన్ 2వ తేదీ, ఆదివారం, సాయంత్రం నాలుగు గంటలకు సంతపేటలోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానం వద్ద మొదలై కేశవ స్వామి పేట శివాలయం, చెన్నకేశవ స్వామి ఆలయాల వరకు 2000 ద్విచక్ర వాహనాల యువకులతో 20 అడుగుల హనుమాన్ మూర్తిని సర్వాంగ సుందరంగా అలంకరించిన రథంపై కొలువుతీర్చి జైశ్రీరామ్ వీర హనుమాన్ నినాదాలతో డీజే వాయిద్యాలతో సంతపేట నాటు బాబురావు పార్క్ నెల్లూరు బస్టాండ్ ట్రంక్ రోడ్డు మీదుగా అద్దంకి బస్టాండ్ బైపాస్ రోడ్డుపై మంగమూరు రోడ్డు సిగ్నల్స్ చిట్టి ఆంజనేయ స్వామి దేవస్థానం రాజా పానగల్ రోడ్డు మీదుగా కేశవ స్వామి పేట చేరు విధంగా శోభాయాత్రను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి జిల్లా ధర్మాచార్య ప్రముఖ్ భైరవేశ్వరానంద స్వామి ఆహ్వానం మేరకు వివిధ ఆధ్యాత్మిక పీఠాలకు చెందిన స్వామీజీ నాగ సాధువులైన అరుణాచలం రుద్రాక్ష స్వామి, శివ రుద్ర మౌన స్వామి, అభినవ కళ్యాణ భారతి స్వామి, సత్యనారాయణ స్వామి, శ్రీనివాసానంద స్వామి, సాంబశివానంద స్వామి, త్యాగరాజానంద స్వామి, శుభోదయానంద స్వామి, రాజయ్య స్వామి, మురళీ గురూజీ తదితరులు విచ్చేస్తున్నారని తెలిపారు.

హనుమాన్ శోభాయాత్రలో యువకులు, పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. విశ్వహిందూ పరిషత్ ప్రాంత సత్సంగ ప్రముఖ సోమ సుబ్బారావు జిల్లా కార్యదర్శి ఇనమనమెల్లూరి సీతారామయ్య ఉపాధ్యక్షులు జిల్లెలమూడి వెంకటేశ్వర్లు, జిల్లా ధర్మచార్య ప్రముఖ భైరవేశ్వరానంద స్వామి విశ్వహిందూ పరిషత్ ప్రముఖులు పాల్గొన్నారు.

కమనీయం వెంకటేశ్వర స్వామి కల్యాణం


ఒంగోలు: కల్యాణ క్రతువులో అర్చక స్వాములు


ఒంగోలులో కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

ఒంగోలు మెట్రో: స్థానిక రంగారాయుడు చెరువు వద్ద గల శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థాన వార్షికోత్సవంలో భాగంగా గురువారం రాత్రి దేవేరులకు నిర్వహించిన శాంతి కల్యాణ మహోత్సవం వైభవోపేతంగా సాగింది. ఈ సందర్భంగా నిర్వాహకులు ముందుగా దేవస్థాన ఆవరణలో చూడచక్కని కళ్యాణ వేదికను ఏర్పాటు చేసి స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను కొలువు తీర్చారు. అనంతరం అర్చక స్వాములు కల్యాణాన్ని రమణీయంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్ల కళ్యాణ క్రతువులో పదిమంది దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం ధర్మకర్తలు పుల్లేటి కుర్తి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో దేవస్థానం పంచమ వార్షికోత్సవాలు స్వామి అమ్మవార్ల కళ్యాణం వైభవంగా జరిపించారు. కార్యక్రమంలో భక్తులకు స్వామి అమ్మవార్ల కల్యాణాన్ని తిలకించి స్వామి ప్రసాదాన్ని అర్చక స్వాముల వేద ఆశీర్వచనం తీసుకున్నారు.

చిట్టి ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు


వెయ్యి లడ్డూల సహస్రనామ పూజలో చిట్టి ఆంజనేయ స్వామి


శేష సాయి, శేషరత్నం సన్మానిస్తున్న భక్తి సంగీత విభావరి సభ్యులు

ఒంగోలు మెట్రో: స్థానిక లాయర్ ప్రకాశం పంతులు విగ్రహం దగ్గర వెలసిన చిట్టి ఆంజనేయ స్వామి దేవాలయంలో హనుమజ్జయంతి మహోత్సవంలో భాగంగా రెండో రోజు గురువారం చిట్టి ఆంజనేయ స్వామికి ఆలయ అర్చకులు విశేష ద్రవ్యాలతో అభిషేకం అర్చన హారతి ఇచ్చారు. సాయంత్రం ఆరు గంటలకు చిట్టి ఆంజనేయ స్వామికి వెయ్యి లడ్డూలతో స్వామికి సహస్రనామ పూజ వైభవంగా నిర్వహించారు. సంస్కృతిక కార్యక్రమంలో భాగంగా దేవస్థానం వేదికపై జరిగిన శ్రీ లీలా తరంగం గానామృతంలో భక్తులు పాల్గొన్నారు.

విశేష అలంకరణలో వీరాంజనేయ స్వామి

ఒంగోలు మెట్రో: హనుమాన్ జయంతి పురస్కరించుకొని ఒంగోలు కేశవ స్వామి పేటలోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఐదు రోజులు పాటు పంచాహ్నికదీక్షతో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా మూడో రోజు గురువారం ఉదయం ఆలయ అర్చకులు ఉప్పులూరి హనుమంత రావు స్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామికి విశేషమైన అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శేషారత్నం.. శేష సాయి ఆర్కెస్ట్రా వారిచే ఏర్పాటు చేసిన భక్తి సంగీత విభావరి భక్తులను అలరించింది. దేవాలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు.

బాలినేనిని కలిసిన పలువురు నాయకులు


బాలినేనితో కలిసి మాట్లాడుతున్న 47వ డివిజన్ అధ్యక్షుడు చావల, నాయకులు

ఒంగోలు సెంట్రల్: మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డిని పట్టణంలోని పలువురు డివిజన్ బాధ్యులు గురువారం హైదరాబాద్‌లో కలిశారు. ఒంగోలులో తమ డివిజన్‌లో పోలింగ్ జరిగిన తీరుపై చర్చించారు. ఎమ్మెల్యేగా విజయదుందుభి మోగించి మంత్రిగా మరలా సేవలు అందించాలని ఆకాంక్షించారు. పలు విషయాలపై చర్చించారు. 47వ డివిజన్ అధ్యక్షుడు చావల శ్రీనివాసరావు, పసుపులేటి దిలిప్ కుమార్, ఇంకొల్లు హరీష్ కుమార్, 49వ డివిజన్ బత్తుల కాశయ్య తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.

కనీస వేతనం రూ.600 చెల్లించాలి

కొత్తపట్నం: మహాత్మ గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు రోజు వేతనం రూ.600 చెల్లించే విధంగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. మండలంలోని ఈతముక్కలలో పేరంటాలగుంట, సోమరప్పాడు చెరువులో ఉపాధి హామీ పనులను గురువారం వ్యవసాయ కార్మిక సంఘం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ప్రాంతాల్లో పని చేస్తున్న ఉపాధి కూలీలు ఎండలు తీవ్రంగా పెరుగుతున్నాయని, మజ్జిగ, మంచినీళ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్స్ వంటివి ఏర్పాటు చేయాలని కోరారు. నీడకు పట్టలు, ప్రథమ చికిత్స పెట్టెలను ఏర్పాటు చేయాలని అధికారులకు విన్నవించారు. ప్రభుత్వం ఒక రోజు వేతనం రూ.300 ప్రకటించగా కనీసం రూ.150 నుంచి రూ.200 లోపు వస్తున్నాయని తెలిపారు. పెరుగుతున్న నిత్యావసర ధరలతో అల్లాడుతుంటే చాలీచాలని ఈ వేతనంతో ఎలా బతకాలో అర్థం కావడంలేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రోజుకు రూ.600 పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం ప్రభుత్వాల ముందు డిమాండ్ పెట్టిందన్నారు. గ్రామీణ పేదల జీవితాలు నిలబెట్టేందుకు ఏడాదికి కనీసం 200 రోజులు పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేదరిక నిర్మూలన జరగాలన్నా, దేశ ఆర్థిక సంక్షోభం నివారించాలన్నా ఉపాధి హామీ పనిదినాలు వేతనాలు పెంచాలని అనేక మంది ఆర్థిక వేత్తలు నివేదికలు పెట్టారని తెలిపారు. గ్రామీణ పేదల కొనుగోలు శక్తి పెరిగితేనే నేడు దేశాభివృద్ధి సాధ్యమవుతుందని మేధావులు చెబుతున్నా ప్రభుత్వాల చెవికెక్కకపోవడం విచారకరమన్నారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్. స్వామి రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు పిల్లి కృష్ణ, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

నగరంలో అగ్నిప్రమాదం


తగలబడిన విద్యుత్ బోర్డు, సహాయక చర్యలు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఒంగోలు టౌన్: నగరంలోని నెల్లూరు బస్టాండు సెంటర్లో గల ది న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీలో గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. భయాందోళనకు గురైన సిబ్బంది, కస్టమర్లు బయటకు పరుగులు తీశారు. అగ్నిమాపక దళ సిబ్బంది వెంటనే మంటలను ఆర్పేశారు. ఎండల తీవ్రతకు భవనంలోని విద్యుత్ మీటరు వద్ద వేడెక్కి షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగినట్లు భావిస్తున్నారు. బ్యాంకు సిబ్బంది అప్రమత్తతతో త్రుటిలో ముప్పు తప్పిందని చెప్పవచ్చు. ప్రజలు భారీ సంఖ్యలో చేరుకోవడంతో కొద్దిసేపు ట్రాఫిక్ అంతరాయం కలిగింది.


సంఘటన స్థలం వద్ద జనం

క్యాన్సర్ లేని సమాజంగా తీర్చిదిద్దాలి

అల్లూరు (కొత్తపట్నం): గ్రామీణ ప్రాంత ప్రజలు క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉంటే క్యాన్సర్ లేని సమాజంగా తీర్చిదిద్దవచ్చని జై భీమ్ క్యాన్సర్ ఇమ్యూనిటీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, చైర్మన్ బద్దెపూడి ప్రశాంతి అన్నారు. అల్లూరు గ్రామం శ్రీహరిపురంలో గురువారం క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా శ్రీహరిపురంలో ప్రజలు ఎటువంటి వ్యాదులకు గురయ్యారు, ఎటువంటి ఆహారం తీసుకుంటున్నారు. ప్రతి ఒక్కరినీ అడిగి తెలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా ప్రశాంతి మాట్లాడుతూ క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించాలన్నారు. క్యాన్సర్ గురించి పూర్తిస్థాయిలో అవగాహన కలిగించారు. మనం తీసుకుంటున్న ఆహార అలవాట్ల వలనే మనకు వ్యాధులు సంభవిస్తున్నాయన్నారు. మన ఇంటి పరిశుభ్రత, ఆహార పరిశుభ్రత పాటించాలన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయంతో సాగుబడి చేసిన ధాన్యాన్ని తీసుకోవాలని సూచించారు. ప్రతి రోజూ వ్యాయమం తప్పనిసరిగా చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం కూడా క్యాన్సర్‌పై ప్రత్యేక శద్ధ తీసుకుని పరీక్షలు చేస్తుందన్నారు. క్యాన్సర్ గురించి సమాచారం కావాలంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ప్రతినిధి బద్దెపూడి ప్రేమానందం, మహిళలు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ప్రశాంతి